

అంతా సాఫీగా సాగుతోందా?
సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లు, కేజీబీవీల్లో తనిఖీ కోసం వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు.
8లో



అప్రమత్తతతోనే వ్యాధులకు చెక్
సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి శ్రీనివాస్ సూచించారు.
8లో



వాతావరణం
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముంది. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురవొచ్చు.

న్యూస్‌రీల్

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నేలకొండపల్లి: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం నేలకొండపల్లి మండలంలో పర్యటించనున్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేయనుండగా, వన మహోత్సవంలో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతారు. అలాగే, పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేస్తారు. ఈకార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని మార్కెట్ చైర్మన్ వి.సీతారాములు ఓ ప్రకటనలో కోరారు.

గురుకుల కళాశాలల్లో రేపు స్పాట్ కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: జోన్–4 పరిధిలోని గురుకుల కళాశాలల్లో ఖాళీ సీట్ల భర్తీకి గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జోనల్ అధికారి స్వరూపరాణి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు 2025లో ఎస్ఎస్‌సీ, సీబీఎస్ఈ, సీఎస్ఈ నుంచి ఒకేసారి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. హాజరైన విద్యార్థుల మార్కులు సమానంగా ఉంటే సబ్జెక్టుల వారీగా మార్కులను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. కులం, ఆదాయం, జనన ధ్రువీకరణ పత్రాలతో పాటు విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, మూడు సెట్ల జిరాక్స్‌లు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆతర్వాత మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని ఆర్‌సీఓ తెలిపారు.

స్థానిక, సంస్థాగత ఎన్నికలపై సమీక్ష



మీనాక్షి, మహేష్‌కుమార్‌తో ఉమ్మడి జిల్లా నేతలు

ఖమ్మంమయూరిసెంటర్: స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికలపై పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హైదరాబాద్‌లో మంగళవారం నాయకులతో సమీక్షించారు. టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ కూడా పాల్గొనగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పార్టీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పోదెం వీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధత, పార్టీ మండల, జిల్లా కమిటీల నియామకంపై చర్చ జరిగిందని వారు తెలిపారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి చల్లా వంశీచంద్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి, నాయకులు బేబీ స్వర్ణకుమారి, చక్కిలం రాజేశ్వరరావు, దైదా రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా హెచ్‌టీ సర్వీసుల మంజూరు

ఖమ్మంవ్యవసాయం: వినియోగదారులకు హెచ్‌టీ 11 కేవీ, 33కేవీ, ఆపై ఓల్టేజీ సర్వీసుల మంజూరు వేగంగా జరగడానికి సింగిల్ విండో వ్యవస్థ ఉపయోగపడుతోందని ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. మంజూరును సరళీకృతం చేసేలా సర్కిల్, కార్పొరేట్ కార్యాలయాల్లో ప్రత్యేక సెల్‌లు ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. వినియోగదారులు అవసరమైన పత్రాలతో దరఖాస్తులను ఎన్పీడీసీఎల్ పోర్టల్ ద్వారా సమర్పిస్తే అధికారులు పరిశీలించి అనుమతులు జారీ చేస్తారని తెలిపారు.

'నవోదయ' దరఖాస్తు గడువు పొడిగింపు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయతో పాటు భద్రాద్రి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయలో 2026–27 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆగస్టు 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పాలేరు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు తెలిపారు. పాలేరులో 80, భద్రాద్రి జిల్లాలోని విద్యాలయలో 40 సీట్లు భర్తీ చేయనున్నందున ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మ.. మహిళ స.. సంఘం!



సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దేలా ప్రణాళిక

- 1.54లక్షల మంది నిరక్షరాస్యుల గుర్తింపు
- తొలి దశలో 50,564 మందికి తర్ఫీదు
- మహిళా సంఘాల సభ్యులకు మొదటి విడతలో ప్రాధాన్యత

ఖమ్మంసహకారనగర్: ఏ ఒక్కరూ నిరక్షరాస్యులుగా మిగిలిపోవద్దనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. గతంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలో వయోజన విద్య కార్యక్రమం కొనసాగగా ఈసారి రాష్ట్ర ప్రభుత్వాన్ని సైతం భాగస్వామ్యం చేసింది. ఈమేరకు జిల్లాలోని 21మండలాల్లో ఇటీవల చేపట్టిన సర్వే ద్వారా 1.54లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించారు. తొలివిడతగా ఉల్లాస్ పేరుతో 50,564మందిని అక్షరాస్యులుగా చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చారు.

లక్ష్యం 50,564మంది

ఉల్లాస్ పథకం ద్వారా జిల్లాలో 50,564 మందిని అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటికే వీరి వివరాలను ఉల్లాస్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈక్రమంలోనే ఖమ్మం కార్పొరేషన్ పరిధి 60డివిజన్లలో 16,984మందిని గుర్తించారు. తొలి విడతగా మహిళా స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులైన సభ్యులకు అదే సంఘాల్లో అక్షరాస్యులైన సభ్యులు శిక్షణ ఇస్తారు. అంతేకాక అంగన్‌వాడీ కేంద్రాల్లో 600మంది నిరక్షరాస్యులైన హెల్పర్లకు అంగన్‌వాడీ టీచర్లతో అక్షరాలు నేర్పించనున్నారు.

పైలట్ ప్రాజెక్టుగా 59వ డివిజన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 'ఉల్లాస్' అమలుకు 59వ డివిజన్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇక్కడ నిరక్షరాస్యులకు శిక్షణ ఇచ్చేలా సిద్ధమవుతున్నారు. ఈ డివిజన్‌లో 800 మంది నిరక్షరాస్యులు ఉండగా, అక్షరాలు నేర్పించే బాధ్యత ముగ్గురు అంగన్‌వాడీలు, ముగ్గురు ఆర్‌పీలకు అప్పగించారు.



ఖమ్మం 59వ డివిజన్‌లో సర్వేను పరిశీలిస్తున్న అధికారులు, మేయర్ నీరజ (ఫైల్)

రాష్ట్రస్థాయిలో శిక్షణ పూర్తి

ప్రస్తుతం నిరక్షరాస్యులను గుర్తించే కార్యక్రమం ముగియగా.. వీరికి శిక్షణ ఇచ్చేందుకు వలంటీర్ల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ఈమేరకు హైదరాబాద్‌లో ఇద్దరు టీచర్లు, ఏపీఎం, డీపీఎంలకు డీఆర్పీలు(డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు)గా శిక్షణ ఇచ్చారు. వీరు ఇక్కడ ఎంపిక చేసిన మండల స్థాయి రిసోర్స్ పర్సన్లకు ఆగస్టు 2న శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం మండలానికి ఒక టీచర్, ఏపీఎంలను గుర్తించాల్సి ఉంది. ఆపై గ్రామస్థాయిలో వీఓలు, వీఓఏలకు శిక్షణ ఇచ్చాక నిరక్షరాస్యుల కోసం పుస్తకాలు సమకూర్చడంతో శిక్షణ మొదలవుతుంది. కాగా, ఉల్లాస్ అమలులో భాగంగా నిరక్షరాస్యుల గుర్తింపు, శిక్షణ కార్యక్రమాలను అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పర్యవేక్షిస్తున్నారు.

త్వరలోనే శిక్షణ ప్రారంభం



నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే క్రమాన ఇప్పటికే గుర్తింపు పూర్తయింది. మండల, గ్రామస్థాయిలో రిసోర్స్ పర్సన్లకు త్వరలోనే శిక్షణ ఉంటుంది. ఆతర్వాత నిరక్షరాస్యులకు పుస్తకాలు అందజేసి శిక్షణ ప్రారంభిస్తాం. తొలిదఫా స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం.
– సీహెచ్.అనిల్‌కుమార్, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్

డెంగీ మరణాలు నమోదు కావొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎంహెచ్ఓ కళావతి, జెడ్పీ సీఈఓ దీక్ష

- పీహెచ్‌సీల్లో సరైన సేవలు అందకే జిల్లా ఆస్పత్రిలో రద్దీ
- వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో కలెక్టర్ అనుదీప్

ఖమ్మంవైద్యవిభాగం: వైద్య రంగంలో జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దేలా వైద్యులు, సిబ్బంది పనితీరు మెరుగుపడాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పర్యవేక్షిస్తూ డెంగీ మరణాలు నమోదు కాకుండా చూడాలని సూచించారు. డెంగీ కేసులను తక్కువ చేసి చూపించాల్సిన అవసరం లేదని, ఎన్ని కేసులు గుర్తించి చికిత్స చేస్తే అంత బాగా పని చేసినట్లు పరిగణిస్తామని తెలిపారు. జిల్లా ఆస్పత్రికి తాకిడి పెరుగుతుందంటే పీహెచ్‌సీల పనితీరు సరిగ్గా లేనట్లే భావించాల్సి వస్తుందన్నారు. ఇటీవల పలు ఆస్పత్రుల్లో తనిఖీ సందర్భంగా అందుబాటులో ఉన్న సిబ్బంది సేవలను మరింత వినియోగించాల్సి ఉందని గుర్తించానని తెలిపారు. ప్రతీ పీహెచ్‌సీకి అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు సమకూర్చుకోవడంతో పాటు ప్రసవాల సంఖ్య పెరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. వైద్య నిపుణులు ఉన్న కొన్ని ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్... అధికంగా ప్రసవాలు జరిగే ఐదు పీహెచ్‌సీలను 24 గంటల పీహెచ్‌సీలుగా మార్చేలా ప్రతిపాదించాలని సూచించారు.

ఉద్యోగుల హాజరు ఆన్‌లైన్‌లో..

అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉద్యోగుల హాజరును ఆగస్టు 1వ తేదీ నుంచి బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనుమతి లేకుండా గైర్హాజరు, ఆలస్యంగా రావడాన్ని సహించేది లేదని హెచ్చరించారు. అలాగే, డిప్యూటేషన్ ఆస్పత్రి అవసరాలకే తప్ప ఉద్యోగుల సౌలభ్యం కోసం ఉండొద్దని తెలిపారు. ఈమేరకు ల్యాబ్ టెక్నీషియన్ల డిప్యూటేషన్ రద్దు చేసి కేటాయించిన ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఎంహెచ్ఓ కళావతి బాయి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, ఆస్పత్రులు సూపరింటెండెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు చేయూత

రఘునాథపాలెం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎంత వేగంగా చేపడితే అంత త్వరగా బిల్లులు విడుదలవుతాయని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలం పువ్వాడ నగర్‌లో ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణదారులకు ఆర్థిక సాయం అందించడమే కాక ఉచితంగా ఇసుక రవాణా చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇదే సమయాన లబ్ధిదారులకు ఆర్థిక సాయంపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. దశల వారీగా పనులు పూర్తికాగానే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఆతర్వాత వనమహోత్సవంలో భాగంగా మెగా బ్లాక్ ప్లాంటేషన్ కోసం రఘునాథపాలెం మండలం జింకలతండా గుట్ట వద్ద స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి సూచనలు చేశారు. జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఉద్యోగులు ప్రవీణ్, పద్మయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాపర్ వైరు మాయంపై ఆరా

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని విద్యుత్ శాఖ ఎంఆర్‌టీ డివిజన్ కార్యాలయంలో రూ.లక్ష విలువైన కాపర్ వైర్ మాయమైన ఘటనపై ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి విచారణ చేపట్టారు. ఈ విషయమై 'సాక్షి'లో మంగళవారం 'విద్యుత్ కార్యాలయంలో కాపర్‌వైరు మాయం' శీర్షికన కథనం రాగా ఎన్పీడీసీఎల్ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. దీంతో ఎంఆర్‌టీ డివిజన్ కార్యాలయానికి వెళ్లిన ఎస్ఈ కాపర్ వైరు నిల్వల రికార్డులు, వినియోగం వివరాలు తెలుసుకున్నారు. అలాగే, విభాగం పరిధిలో జరుగుతున్న పనులు, ట్రాన్స్‌ఫార్మర్లలో వినియోగించే ఆయిల్ నిల్వలపై ఆరా తీసి తేడాలు గుర్తించినట్లు సమాచారం. వాచ్‌మెన్లు ఉన్నా కార్యాలయం తాళాలు పగలగొట్టి కాపర్‌వైరు తరలించడంపై పలు కోణాల్లో విచారణ చేపట్టడమేకాక డీఈ భద్రుపవర్, ఉద్యోగుల నుంచి వివరాలు సేకరించారు. ఈ అంశంపై విచారణకు కమిటీని ఏర్పాటు చేయాలనే యోచనకు వచ్చినట్లు తెలుస్తుండగా, మరోమారు ఎలాంటి ఘటనలు జరగకుండా ఎంఆర్‌టీ డివిజన్ కార్యాలయం, ల్యాబ్‌కు హుటాహుటిన సీసీ కెమెరాలు ఏర్పాటుచేయించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, పక్కన నాయకులు

- కేఎంసీనీ కైవసం చేసుకుంటాం..
- ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

ఖమ్మంమామిళ్లగూడెం: జిల్లాలో బీజేపీకి ఆదరణ పెరుగుతున్న నేపథ్యాన స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడమే కాక ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ పీఠాన్ని సైతం కై వసం చేసుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. జిల్లా పర్యటన కోసం మంగళవారం వచ్చిన ఆయనకు కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆపై ఖమ్మం కాల్వొడ్డు, మయూరిసెంటర్, పాత బస్టాండ్, వైరా రోడ్డు మీదుగా జెడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక ర్యాలీగా ఇల్లెందు క్రాస్‌రోడ్, బైపాస్ మీదుగా పార్టీ జిల్లా ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనానికి రాంచందర్‌రావు చేరుకున్నారు.

అభివృద్ధి జాడలేవి?

జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా అభివృద్ధి జరగడం లేదని ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. ఏ మంత్రి కూడా అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. కేంద్రప్రభుత్వం అమృత్ పథకం కింద రూ.450 కోట్లను ఖమ్మం అభివృద్ధికి కేటాయించిందని తెలిపారు. ఖమ్మంలో నాలుగు జాతీయ రహదారులు కూడా కేంద్రం చొరవతో వచ్చాయని చెప్పారు. ఖమ్మంను నిన్నామొన్నటి వరకు కమ్యూనిస్టుల అడ్డాగా చెప్పగా.. రాబోయే రోజుల్లో బీజేపీ అడ్డాగా మారనుందని తెలిపారు. జిల్లాలో బీజేపీ బలోపేతం అవుతున్నందున స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశం, ధర్మం, జాతి, సమాజంతోపాటు రైతుల కోసం పనిచేసేది బీజేపీ మాత్రమేనని రాంచందర్‌రావు వెల్లడించారు. ఈ సమ్మేళనంలో జిల్లా నలుమూలల నుంచి పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను వివరించారు. అనంతరం ఖమ్మం ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద బీజేపీ కార్యాలయాన్ని రాంచందర్‌రావు ప్రారంభించారు. ఆ తర్వాత వివిధ రంగాల మేధావులతో సమావేశమై చర్చించారు. బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు తాండ్ర వినోద్‌రావు, సన్నె ఉదయ్‌ప్రతాప్, దేవకి వాసుదేవరావు, గెంటేల విద్యాసాగర్, దొంగల సత్యనారాయణ, గల్లా సత్యనారాయణ, నంబూరి రామలింగేశ్వరరావు, వాకదాని పుల్లారావు, అల్లిక అంజయ్య, డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, సున్నా రవి, విజయరాజు, రుద్రగాని ప్రదీప్, విజయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ ప్రతిమతో రాంచందర్‌రావు

చేపపిల్లల పంపిణీ ఎప్పుడు?

- ప్రతిపాదనలకే పరిమితమైన ప్రక్రియ
- టెండర్లపై మీనమేషాలు
- ఎదురుచూపుల్లో మత్స్యకారులు

ఖమ్మంవ్యవసాయం: చేపపిల్లల ఉచిత పంపిణీలో జాప్యం మత్స్యకారులను ఆవేదనకు గురిచేస్తోంది. మత్స్యశాఖ సమర్పించిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండగా.. ఆమోదముద్ర వేస్తేనే టెండర్ల ప్రక్రియ మొదలుకానుంది. ఆతర్వాత కాంట్రాక్టర్ల ఎంపిక, చేపపిల్లల సేకరణ, సరఫరా జరగాల్సి ఉండడంతో అదును దాటుతుందా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మత్స్యకారుల జీవనోపాధి, ఆర్థికాభివృద్ధి కోసం 2018–19 నుంచి ఉచిత చేపపిల్లల పథకం అమలవుతుండగా, ఏటా ఏప్రిల్‌లోనే టెండర్లు నిర్వహించి జూలై, ఆగస్టు నెలల్లో చెరువులు, కుంటల్లో పిల్లలు వదులుతారు. అయితే, బకాయిలు పేరుకుపోయాయని కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో గత ఏడాది ఆగస్టు తర్వాతే పిల్లల పంపిణీ మొదలైంది. ఇక ఈసారి రాష్ట్ర ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిన నేపథ్యాన, ముఖ్యమంత్రి ఆమోదిస్తే ఆర్థిక శాఖ నిధులు మంజూరు చేయనుంది.

నిండుకుండల్లా జలాశయాలు

ఇటీవలి వర్షాలతో జిల్లాలోని జలాశయాలన్నీ నిండాయి. చెరువులు, కుంటలు నిండినా చేపపిల్లల పంపిణీ టెండర్ల దశకు చేరలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చేపపిల్లల పథకానికి ఆమోదముద్ర వేస్తే మత్స్యశాఖ టెండర్ల ప్రక్రియ చేపడుతుంది. ఆగస్టు మొదటి, రెండు వారాల్లో టెండర్లు నిర్వహించినా ఆగస్టు చివరి లేదా సెప్టెంబర్ మొదటి వారం నుంచి చేపపిల్లల సరఫరాకు అవకాశం ఏర్పడుతుంది.

జిల్లాకు 3.68 కోట్ల చేపపిల్లలు

జిల్లాలో 880 చెరువులు, కుంటల్లో 3.68 కోట్ల చేపపిల్లల పంపిణీకి మత్స్యశాఖ ప్రతిపాదించింది. ఇందుకోసం రూ.5.50కోట్ల మేర నిధులు అవసరమని అంచనా. కాగా, 3.68కోట్ల పిల్లల్లో 1.40కోట్లు 35–40 మి.మీ., 2.28కోట్ల పిల్లలు 80–100మి.మీ.వి కావాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. చిన్న చేపపిల్ల ఖరీదు రూ.0.60, పెద్దవైతే రూ.1.50 వరకు ఉంటుంది. గత ఏడాది ఇదే ధరలతో టెండర్లు ఖరారయ్యాయి. చిన్నపిల్లల్లో బొచ్చ, రవ్వ, బంగారుతీగ, పెద్ద పిల్లల్లో బొచ్చ, రవ్వ, మృగాలు రకాలు ఉంటాయి. గత ఏడాది వరదల కారణంగా జిల్లాలో 2.68 కోట్ల చేపపిల్లలను 876 జలాశయాల్లో వదిలారు.



16వేల కుటుంబాలకు జీవనోపాధి

జలాశయాల్లో చేపపిల్లల పెంపకం ద్వారా జిల్లాలో 220మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చెందిన 16వేల మత్స్య కుటుంబాలకు ఉపాధి లభిస్తోంది. పరోక్షంగా మరికొన్ని వేల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. గతంలో సంఘాల ఆధ్వర్యాన చేపపిల్లలను కొనుగోలు చేసి జలాశయాల్లో వదిలేవారు. ఆ తర్వాత ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుండడంతో లబ్ధి జరుగుతుండగా, రెండేళ్ల నుంచి జాప్యంతో సమస్యలు మొదలయ్యాయి. ఈసారైనా సకాలంలో జలాశయాల్లోకి చేపపిల్లలు చేరేలా చూడాలని మత్స్యకారులు కోరుతున్నారు.

జలాశయాలు అనుకూలం



చేపపిల్లల పంపిణీకి ప్రభుత్వం అనుమతులు ఇవ్వగానే టెండర్లు మొదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం జిల్లా జలాశయాలు చేపపిల్లలను వదిలేందుకు అనుకూలంగా ఉన్నాయి.
– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

మాకో సీటు కావాలి!

ఎస్‌ఐ ఉద్యోగం అంటే ఆ తీవి, హుందానే వేరు. ఈ కొలువుకు ఉన్న స్థాయి అంతాఇంతా కాదు. కానీ ఇదంతా గతకాల వైభవంగా మారిపోతోంది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా జిల్లా కేంద్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లతో పాటు ముఖ్యపట్టణాల్లోని పీఎస్‌లను సైతం శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. తద్వారా అక్కడ ఎస్సైలకు బదులు సీఐ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌ఓ(స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా బాధ్యతలు నిర్వర్తిస్తుండడం ఎస్సైల సీటుకు ముప్పు తెచ్చిపెట్టినట్లయింది. – ఖమ్మంక్రైం

- పలు పీఎస్‌ల్లో ఎస్సైలకు కుర్చీలు కరువు
- ఎస్‌హెచ్‌ఓ ఠాణాలన్నింటా ఇదే పరిస్థితి

ఒక్కో స్టేషన్‌లో ఐదుగురు

జిల్లా కేంద్రంతో పాటు ముఖ్యపట్టణాల్లో పోలీసుస్టేషన్లను శాంతిభద్రతల పర్యవేక్షణ, కేసుల సత్వర విచారణ కోసం అప్‌గ్రేడ్ చేశారు. ఆయా పీఎస్‌లకు ఎస్‌హెచ్‌ఓలుగా సీఐలను నియమించడమే కాక ఒక్కో స్టేషన్‌లలో ఐదుగురి నుంచి ఆరుగురు ఎస్సైలను కేటాయించారు. తద్వారా వాహనాల తనిఖీ, కేసుల విచారణ, ఇతర పనులన్నీ సాఫీగా, సులువుగా సాగిపోతున్నాయి.



ఖమ్మం త్రీటౌన్ స్టేషన్‌లో నిర్మిస్తున్న గదులు

కూర్చోవడానికి కుర్చీలు ఏవీ?

ఖమ్మంలోని వన్, టూ, త్రీ టౌన్ పీఎస్‌లే కాక ఖానాపురం, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, ముదిగొండ, మధిర పోలీస్‌స్టేషన్లను దశల వారీగా అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో వన్, టూ, త్రీ టౌన్ పీఎస్‌లతోపాటు ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌కు కొన్నేళ్ల క్రితమే ఎస్‌హెచ్‌ఓగా సీఐ స్థాయి అధికారిని నియమించారు. దీంతో అప్పటివరకు స్టేషన్ ఇన్‌చార్జ్‌గా కొనసాగిన ఎస్‌ఐలు సిబ్బందిలో ఒకరిలా మారాల్సి వచ్చింది. అంతేకాక ఐదుగురి వరకు ఎస్సైలను కేటాయించి స్టేషన్ పరిధిని సెక్టార్లుగా విభజించి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇంతవరకు బాగానే ఉన్నా అప్‌గ్రేడ్ అయిన ఠాణాల్లో ఎస్‌ఐ స్థాయి అధికారులు కూర్చోవడానికి కుర్చీలు లేక ఒకే గదిలో నలుగురి నుంచి ఐదుగురు కూర్చోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీంతో చేసేదేం లేక కింది స్థాయి సిబ్బంది కుర్చీలో సర్దుకుంటుండగా వారికి ఇక్కట్లు మొదలయ్యాయి. ఫలితంగా కొందరు 'మా ఆరోగ్యమే బాగా లేక ఇబ్బంది పడుతున్నాం.. ఇప్పుడు మీరు మా కుర్చీల్లో కూర్చుంటే మేం నిలబడాలా' అని ఎస్‌ఐల ముఖం పట్టుకుని అంటున్నట్లు తెలిసింది.

త్రీటౌన్‌లో ప్రత్యేక గదులు

ఎస్‌ఐల ఇక్కట్లు చూడలేక ఖమ్మం త్రీటౌన్ స్టేషన్ ఆవరణలో రేకులతో గదులు నిర్మిస్తున్నారు. ఇదే తరహాలో మిగతా స్టేషన్లలోనూ నిర్మిస్తే తప్ప ఎస్సైల ఇబ్బందులకు పరిష్కారం లభించే అవకాశంలేదు. ఉన్నతాధికారులు ఈ దిశగా ఆలోచించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఎస్సీ డీడీ 'హాస్టల్ నిద్ర'

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపులోని ఎస్సీ బాలుర 'బీ' వసతి గృహంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజన మెనూ, తాగునీటితో పాటు పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. అలాగే, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న డీడీ వసతుల కల్పనపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు గుర్తించేలా వసతి గృహాల్లో బస చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారని తెలిపారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి నిద్రించారు. వసతిగృహ సంక్షేమ అధికారులు కోటపాటి రుక్మారావు, స్టాలిన్, ఉద్యోగులు పాల్గొన్నారు.




విద్యార్థులతో కలిసి నిద్రించిన డీడీ సత్యనారాయణ, ఉద్యోగులు

క్లుప్తంగా

రేపు జాబ్ మేళా

ఖమ్మం రాపర్తినగర్: జిల్లాలో నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించేలా ఈనెల 31వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి మాధవి తెలిపారు. ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కేర్ సెంటర్‌లో జరిగే జాబ్ మేళాలో వివిధ కంపెనీల బాధ్యులు పాల్గొని 86పోస్టులకు అర్హులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. 18 – 30 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులని, అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల ఒరిజినల్స్, జిరాక్స్‌లతో ఉదయం 10 గంటలకల్లా హాజరు కావాలని సూచించారు.

ప్రకాశ్‌నగర్ వంతెనపై మరమ్మతులు



పగుళ్లు వచ్చిన చోట వేసిన సిమెంట్ పూత

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేటి వంతెనపై పగుళ్లు ఏర్పడగా అధికారులు స్పందించారు. ఈమేరకు మంగళవారం పగుళ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వంతెనపై వేర్ కోటింగ్‌లో పగుళ్లు వచ్చిన చోట సిమెంట్‌తో అతుకులు వేయించగా ఆర్‌అండ్‌బీ డీఈ చంద్రశేఖర్, ఏఈ ప్రవీణ్ పర్యవేక్షించారు.

ఇప్పటివరకు 2,360 ఫోన్ల రికవరీ



ఫోన్లు అందిస్తున్న అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు

ఖమ్మంక్రైం: పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 2,360 ఫోన్లను రికవరీ చేసి యజమానులకు అందించామని అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ఫోన్లు పోగొట్టుకుని సీఈఐఆర్‌పీ(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్) ద్వారా నమోదు చేసుకున్న 28 మందికి మంగళవారం ఆయన రికవరీ చేసిన ఫోన్లు అందజేసి మాట్లాడారు. ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేస్తే తమ ఐటీ సెల్ బృందం ట్రాక్ చేస్తోందని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 7,121 మంది పోర్టల్‌లో నమోదు చేయగా 2,360 ఫోన్లను రికవరీ చేశామని వెల్లడించారు. ఇందులో కీలకంగా వ్యవహరించిన ఐటీ సెల్ ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బందిని అడిషనల్ డీసీపీ అభినందించారు.

పాఠశాలలో 'అటల్' ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ

కొణిజర్ల: ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్(పీఎంశ్రీ) పథకం కింద ఎంపికైన మండలంలోని సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను డీఈఓ సామినేని సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు సాంకేతిక బోధన అందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అలాగే, సింగరాయపాలెం, తనికెళ్ల హరిజనవాడ, సీపీఎస్ తనికెళ్ల, తుమ్మలపల్లి, చిన్నగోపతి పాఠశాలల విద్యార్థులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ సమకూర్చిన నోట్ పుస్తకాలు, సామగ్రిని డీఈఓ అందజేశారు. ఎంఈఓ డి.అబ్రహం, హెచ్‌ఎంలు కె.లక్ష్మీనారాయణ, సుజాత, ఏఏపీ చైర్మన్ జహేదా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంతా సాఫీగా సాగుతోందా?

- గురుకులాలు, హాస్టళ్లు, కేజీబీవీల్లో అధికారుల తనిఖీలు
- హాజరు, సౌకర్యాల పరిశీలన... మెనూ అమలుపై సర్వే
- మండల, మున్సిపల్ అధికారులతో బృందాల ఏర్పాటు





సత్తుపల్లి బీసీ బాలికల కళాశాల వసతిగృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంఈఓ, (ఇన్‌సెట్) స్టోర్‌రూంలో సరుకులను పరిశీలిస్తూ...

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ గురుకులాలు, వసతి గృహాలతో పాటు కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో విద్యార్థులకు వసతులు, సౌకర్యాలను మరింత మెరుగుపర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రతీ జిల్లాలో ఐఏఎస్ అధికారులు ఒక దఫా తనిఖీ చేపట్టగా.. మరోసారి పూర్తి స్థాయిలో తనిఖీ చేపట్టాలని జిల్లా అధికారులు నిర్ణయించారు. ఈమేరకు జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాలు, వసతిగృహాలతో పాటు కేజీబీవీల్లో తనిఖీల కోసం ప్రత్యేక అధికారులను నియమించారు. జిల్లాలో గురుకులాలు, వసతిగృహాలు, కేజీబీలు అన్నీ కలిపి 181 ఉండగా.. వీటిలో తనిఖీకి అధికారులను నియమిస్తూ అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఉత్తర్వులు జారీ చేశారు. బుధ, గురువారం తనిఖీ చేయాలని ఆదేశించగా కొన్నిచోట్ల అధికారులు ముందుగానే ప్రారంభించారు.

అధికారులతో బృందాలు

జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలు, గ్రామాల్లోని గురుకుల పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీల్లో తనిఖీ కోసం మండల, మున్సిపల్ అధికారులను నియమించారు. మండలాల నుంచి తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓ, ఎంఈఓలను నియమించగా.. మున్సిపాలిటీల నుండి కమిషనర్లు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అసిస్టెంట్ కమిషనర్, ఇంజినీర్లు, ఉద్యాన అధికారికి బాధ్యతలు అప్పగించారు. వీరు తమకు కేటాయించిన విద్యాసంస్థల్లో బుధవారం, గురువారం తనిఖీ చేయాల్సి ఉంటుంది.

ఏమేం పరిశీలిస్తారంటే...

తనిఖీ సమయంలో అధికారులు ప్రధానంగా ఏడు అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. విద్యార్థుల హాజరు శాతం, వసతి గృహాల్లోని పడకలు, తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు వంటి కనీస సౌకర్యాల లభ్యతను పరిశీలిస్తారు. ఇవన్నీ విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉన్నాయా, లేదా అని చూడడమే కాక భవనాలు, ప్రహరీ గోడలు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల ప్రస్తుత పరిస్థితిని అంచనా వేస్తారు. ఎక్కడైనా మరమ్మతులు అవసరమా, భద్రతాపరమైన లోపాలు ఉన్నాయా అని కూడా పరిశీలించడమే కాక వంటశాలలు, దోమల నివారణ చర్యలు, తాగునీటి శుభ్రత, వ్యర్థాల నిర్వహణపైనా ఆరా తీస్తారు. ఇదే సమయాన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను, మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేస్తారు. అంతేకాక విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పాఠ్య ప్రణాళిక అమలు, ఉపాధ్యాయుల హాజరు, బోధనా నాణ్యత ఆరా తీయనున్నారు. ఆయా అంశాల్లో ఏదైనా సమస్యలు, ఫిర్యాదులను గుర్తిస్తే విచారణ చేపడుతారు.

నివేదికలు..

అధికారులు విద్యాసంస్థల్లో తనిఖీ సమయాన గుర్తించే అంశాలన్నింటినీ గూగుల్ ఫామ్(ఆన్‌లైన్)లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆపై ఆగస్టు 1న నివేదికలను శాఖల వారీగా ఉన్నతాధికారులకు సమర్పించారు. ఇందులోని అంశాల ఆధారంగా తీసుకునే చర్యలను వారు 4వ తేదీన కలెక్టర్‌కు అందించాల్సి ఉంటుంది.

విద్యుత్ సమస్యలు ఎదురుకావొద్దు



ముదిగొండ : అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్‌ఈ శ్రీనివాసాచారి

ముదిగొండ: జిల్లాలో ఎక్కడా విద్యుత్ సంబంధిత సమస్యలు రాకుండా ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ముదిగొండ మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన ఏఈలతో కలిసి పరిశీలించారు. వల్లభి, పమ్మి గ్రామాల్లో ఇళ్లపై వెళ్తున్న విద్యుత్ లైన్లను సరిచేస్తుండగా సూచనలు చేశారు. అనంతరం ఎస్‌ఈ ముదిగొండ సబ్‌స్టేషన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

- నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో రూ.8.87 కోట్ల విలువైన పనులు చేపట్టామని ఎస్‌ఈ శ్రీనివాసాచారి వెల్లడించారు. మండలంలోని నేలకొండపల్లి, రాజేశ్వరపురం సబ్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించాక ఆయన మాట్లాడారు. పాలేరు నియోజకవర్గంలో 4,200 స్తంభాల ఏర్పాటు, ఇళ్ల పైనుంచి తీగలు వెళ్తున్న చోట లైన్ల మార్పిడి చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమాల్లో డీఈలు సీహెచ్.నాగేశ్వరరావు, చింతమళ్ల నాగేశ్వరరావు, ఏడీఈ బి.రామకృష్ణ, కోక్యానాయక్, ఏఈలు మేకపోతుల శ్రీనివాస్, వి.నారాయణ, కె.రామారావు, నారాయణరావు, నేలకొండపల్లి మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడిపై దృష్టి



బోనకల్‌లో పంచాయతీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

బోనకల్/చింతకాని: మారిన వాతావరణ పరిస్థితుతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతిబాయి ఆదేశించారు. బోనకల్‌లో డెంగీ కేసు నమోదైన నేపథ్యాన మంగళవారం ఆమె పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఓపీకి వస్తున్న వారి వివరాలు, అందుతున్న చికిత్స, మందుల లభ్యతపై ఆరాతీశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ప్రజలకు పరిశుభ్రతపై సూచనలు చేశారు. ఆతర్వాత బస్టాండ్ సెంటర్ వద్ద ఎన్ఎస్పీ కెనాల్‌లో ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారం పడి ఉండడంతో త్వరగా శుభ్రం చేయించాలని సూచించారు. వైద్యాధికారి స్రవంతి, ఉద్యోగులు దానయ్య, రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే, చింతకాని, నాగులవంచలోని ఆరోగ్య కేంద్రాలను కూడా తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ సీజనల్ వ్యాధుల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్యసిబ్బందికి సూచనలు చేశారు. పారిశుద్ధ్య పనులు, డ్రై డే నిర్వహణ, నీటి నిల్వ ప్రాంతాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని తెలిపారు. అనంతరం రేపల్లెవాడలో వైద్య శిబిరాన్ని పరిశీలించి ఇంటింటా సర్వేపై సూచనలు చేశారు. వైద్యులు అల్తాఫ్, వేణుమాధవ్, ఉద్యోగులు వీరేందర్, కృష్ణారావు, లక్ష్మి, దైవమ్మ, సుజాత, పద్మ పాల్గొన్నారు.

డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు

అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



చంద్రుతండాలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో డెంగీ కేసులు నమోదైనందున జ్వరాల కట్టడికి వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీ ఉద్యోగులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశించారు. తిరులాయపాలెం మండలంలోని చంద్రుతండాలో ఏడుగురికి డెంగీ నమోదు కావడంతో మంగళవారం ఆమె గ్రామాన్ని పరిశీలించారు. డెంగ్యూ సోకిన వారి ఇళ్లలో అందరికీ పరీక్షలు చేయించడమే కాక సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం మండలంలోని మహ్మదాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీసి పారిశుద్ధ్య నిర్వహణ, ఇంకుడు గుంతల నిర్మాణంపై ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిని సూచనలు చేశారు. ఆతర్వాత సుబ్లేడు పీహెచ్‌సీలో తనిఖీ చేసిన అదపు కలెక్టర్ మందుల లభ్యత, పరీక్షల నిర్వహనపై ఆరా తీసి ప్రతీ గ్రామపంచాయతీలో వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. డీఎల్‌పీఓ టి.రాంబాబు, వైద్యాధికారి సుబ్బారావు, ఎంపీడీఓ ఎస్.కె.సిలార్ సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ, డాక్టర్ వసుంధర పాల్గొన్నారు.

ఏటీసీల్లో కోర్సులపై విస్తృత ప్రచారం

ఖమ్మంమయూరిసెంటర్: ఐటీఐ, ఏటీసీల్లో అందుబాటులో ఉన్న ఉపాధి కోర్సులపై విస్తృత ప్రచారం చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కేఎంసీ కార్యాలయంలో మంగళవారం ఐటీఐల్లో ప్రవేశాలు, అక్షరాస్యత, పారిశుద్ధ్య నిర్వహణ, పెట్రోల్ పంపుల ఏర్పాటు అంశాలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అనువైన స్థలాలు గుర్తించి పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు ప్రతిపాదించాలని తెలిపారు. ఏదులాపురం, రఘునాథపాలెం, మధిర, సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాలు గుర్తించాలని చెప్పారు. ఐటీఐ, ఏటీసీల్లో 255 సీట్లు ఖాళీగా ఉన్నందున యువత చేరేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అలాగే, నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించడం, ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు, ప్రభుత్వ విద్యాసంస్థల్లో అవసరమైన మరమ్మతులు, కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుపై సూచనలు చేశారు. డీఈఓ ఎస్.సత్యనారాయణ, డీఐఈఓ రవిబాబు, ఆర్డీఓ నర్సింహారావు, అడిషనల్ డీఆర్డీఓ జయశ్రీ, కేఎంసీ సహాయ కమిషనర్ అనిల్‌కుమార్, మునిసిపల్ కమిషనర్లు సంపత్‌కుమార్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గురుకులంలో డీపీఓ తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

ఎర్రుపాలెం: ప్రభుత్వ నిర్దేశిత మెనూ అమలవుతోందా, భోజనం నాణ్యతగా ఉంటుందా.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆరా తీశారు. ఎర్రుపాలెంలోని గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఆమె భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే, పారిశుద్ధ్య నిర్వహణపై ఉద్యోగులకు సూచనలు చేసిన డీపీఓ, సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అవకాశం ఉన్నందున జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఆతర్వాత బనిగండ్లపాడు పీహెచ్‌సీని తనిఖీ చేస డాక్టర్ అశ్విని నుంచి వివరాలు సేకరించారు. అలాగే, దళిత కాలనీలో పారిశుద్ధ్య పనులను కూడా తనిఖీ చేశారు. ఎంపీఓ జి.శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఏలేశ్వరరావు పాల్గొన్నారు.

వారిది విద్వేషం.. మాది హక్కుల రక్షణ

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న వీరభద్రం, పక్కన నాయకులు

కొణిజర్ల: దేశంలో మైనార్టీలు, మెజార్టీల మధ్య మత విద్వేషాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. కొణిజర్లలో మంగళవారం నిర్వహించిన పార్టీ వైరా డివిజన్ స్థాయి వర్క్‌షాప్‌లో ఆయ న మాట్లాడారు. బీజేపీ పాలనలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరలపై నుంచి ప్రజల దృష్టి మళ్లించేలా మతం పేరుతో విభజించి పాలిస్తున్నారన్నారు. ఇదే సమయాన రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు కమ్యూనిస్టులుగా తాము కృషి చేస్తున్నామని తెలి పారు. కాగా, రాష్ట్రప్రభుత్వం స్థానిక ఎన్నికలను దృష్ట్యా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తోందని పేర్కొన్నారు. అయినప్పటికీ స్థానిక ఎన్నికల్లో అవకాశం ప్రతీచోట తాము స్వంతంగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తమ్మినేని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శనరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ శ్రేణులకు ఇస్తున్నారని విమర్శించా రు. సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, దుగ్గి కృష్ణ, మచ్చా మణి, కొండెబోయిన నాగేశ్వరరావు, కొప్పుల కృష్ణయ్య, చింతనిప్పు చలపతి రావు, బాణోత్ బాలాజీ, కుటుంబరావు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే వ్యాధులకు చెక్

ఆయుష్ డైరెక్టర్, జిల్లా ప్రత్యేకాధికారి శ్రీనివాస్



పెద్దాస్పత్రిలో రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న ఆయుష్ డైరెక్టర్ శ్రీనివాస్

ఖమ్మంవైద్యవిభాగం: సీజనల్ వ్యాధుల వ్యాప్తి నేపథ్యాన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులే కాక ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ పెరుగు శ్రీనివాస్ సూచించారు. తద్వారా వ్యాధులను కట్టడి చేయొచ్చని తెలిపారు. సీజనల్ వ్యాధుల కట్టడికి జిల్లా ప్రత్యేక అధికారిగా నియమితులైన ఆయన ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. ఈమేరకు రోజువారీ ఆస్పత్రిలో ఓపీ నమోదు, డెంగీ, విషజ్వరాల బాధితులకు అందుతున్న చికిత్సలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్‌తో సమీక్షించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ డెంగీ కేసులు వెలుగు చూస్తున్నందున ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరికైనా జ్వరం లక్షణాలు ఉంటే సమీప ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలని సూచించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ బి.రాంబాబు, డాక్టర్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

- నేలకొండపల్లి: నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయుష్ డైరెక్టర్ పి.శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి సేవలపై ఆరా తీయడమే కాక ల్యాబ్‌లో పరీక్షల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో సమావేశమై పరీక్షలు, చికిత్స, మందుల లభ్యతపై సూచనలు చేశారు. ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రమీల, వైద్యాధికారులు మంగళ, కె.రాజేష్ పాల్గొన్నారు.

ప్రతిమ మృతిపై కేసు నమోదు

ఆందోళనతో వెళ్లిపోయిన విద్యార్థినులు



పాఠశాల వద్ద పోలీసుల పహారా

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫిట్స్‌తో సోమవారం పదో తరగతి విద్యార్థిని భూక్యా ప్రతిమ మృతి చెందగా, ఆమె తండ్రి రమేష్ ఫిర్యాదుతో రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆమె ఫిట్స్‌తోనే మృతి చెందిందా, ఇతర కారణాలు ఉన్నాయా అనేది నిర్ధారించేందుకు పోలీసులు సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించడమే కాక ఆమె స్నేహితులు, వార్డెన్, ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. కాగా, ప్రతిమ మృతితో గురుకులం నుంచి పలువురు విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. అలాగే, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ ముష్క రాజు తెలిపారు.

- ఖమ్మం మామిళ్లగూడెం: గొల్లగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మృతికి వార్డెన్, ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో పాటు డీడీ పర్యవేక్షణ లోపమే కారణమని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈమేరకు బాధ్యులపై చర్యలు తీసుకోవడమే కాక విద్యార్థిని కుటుంబానికి రూ.50లక్షల పరిహారం చెల్లించాలని కోరుతూ డీఆర్‌ఓ పద్మశ్రీకి వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వంగూరి వెంకటేష్, మాదుపల్లి లక్ష్మణ్, గోకినపల్లి మస్తాన్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



యూరియా కోసం కూలో ఉన్న రైతులు

కల్లూరురూరల్: ఈ వానాకాలం సీజన్ అవసరాలకు కల్లూరు, చెన్నూరు, కొర్లగూడెం, పోచవరం, చిన్నకోరుకొండి పీఏసీఎస్‌లకు 570 మెట్రిక్ టన్నులు, డీలర్లకు 575 మెట్రిక్ టన్నుల యూరి యా సరఫరా అయింది. ఈ యూరియా రైతులందరికీ సరిపోయే పరిస్థితి లేకపోగా, భవిష్యత్‌లో మరింత కొరత వస్తుందనే ప్రచారంతో కొనుగోలుకు బారులు దీరుతున్నారు. ఫలితంగా భూమి ఆధారంగా యూరియా పంపిణీ చేస్తున్నారు. ఈక్రమంలోనే కల్లూరు, చెన్నూరు సొసైటీల వద్ద మంగళవారం రైతులు బారులు దీరగా ఏఓ రూప, ఎస్సై హరిత యూరియా పంపిణీని పర్యవేక్షించారు.

మళ్లీ రాజుకుంటున్న పోడు వివాదం

- ఏళ్లుగా పట్టాలకు నోచుకుని ఎల్లన్ననగర్ వాసులు
- ఫలితంగా ప్రతీ వానాకాలం గొడవలే



గుబ్బగుర్తి అటవీ ప్రాంతంలోని పోడు భూమి

కొణిజర్ల: కొణిజర్ల మండలంలో ఉన్న కాస్తంత అడవిని రక్షించాలని అటవీ అధికారులు... ఏళ్లుగా సాగు చేసకుంటున్నందునతమకు పట్టాలు ఇవ్వాలని పోడుదారులు పోటీ పడుతుండడంతో ఏటా ఘర్షణలు సర్వసాధారణమయ్యాయి. కొణిజర్ల మండలం గుబ్బగుర్తి అటవీ ప్రాంతంలో బేస్‌మెంట్ క్యాంప్ 58లో దాదాపు 490 హెక్టార్లలో అటవీ భూమి విస్తరించి ఉండేది. కొన్నేళ్లుగా ఈ భూమిలో పలువురు పోడు కొట్టి సాగు చేసుకుంటున్నారు. పదేళ్ల క్రితం వివిధ గ్రామాల నుంచి 200కుటుంబాల అటవీ ప్రాంతానికి సమీపానే ఎన్నెస్పీ కాల్వ పక్కన గుడిసెలు వేసుకున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో గుబ్బగుర్తి, విక్రమ్‌నగర్, జంపాలనగర్, క్రాంతినగర్, సాలెబంజర, మొకాలకుంట, లక్ష్మీపురం తదితర గ్రామాల ప్రజలకు పట్టాలు అందాయి. ఆపై బీఆర్‌ఎస్ వచ్చాక కూడా కొందరికి పట్టాలు ఇచ్చారు.

ఆ తర్వాత పోడు కొట్టారని...

ఎల్లన్ననగర్ వాసులు 2008 తర్వాత పోడు చేశారని అటవీ అధికారులు కొత్తగా ఎవరికీ పట్టాలు ఇవ్వడం లేదు. కనీసం ఎవరికి ఎంత భూమి ఉందో సర్వే చేయించలేదు. ఈక్రమాన 490 హెక్టార్లలో 450హెక్టార్ల అడవి అన్యాక్రాంతం కాగా, మిగిలిన భూమిని కాపాడుకోవాలనేది తమ ప్రయత్నంగా అటవీ అధికారులు చెబుతున్నారు. ఇదే సమయాన ఎల్లన్ననగర్ వాసులు మిగిలిన భూమిని సైతం దున్నుతున్నారని ఆంక్షలు పెడుతున్నారు. అయితే, అనుమతించిన భూమిలోనే పంటలు సాగు చేస్తుండగా అధికారులు మొక్కలను తొలగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈనెల 19న కూడా ఓ రైతు పొలంలో పత్తి మొక్కలు తొలగించగా ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఎల్లన్ననగర్‌లో పోడు సమస్య నానాటికీ తీవ్రమవుతున్నందున అధికారులు, ప్రభుత్వం స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ఏటా మరింత లోనకు వస్తున్నారు...

ఎల్లన్ననగర్ ప్రాంతంలో 24 హెక్టార్ల అడవే మా ఆధీనంలో ఉంది. దీన్ని కాపాడుకునేలా మొక్కలు నాటిస్తుంటే పోడు సాగుదారులు ఏటా కొంత చొప్పున చదును చేస్తున్నారు. అనుమతి ఉన్నంత మేర సాగు చేసుకోవాలని సూచించినా వినడం లేదు. జంతువులు నీళ్లు తాగేందుకు ఏర్పాటు చేసిన పిట్లను కూడా పగలగొట్టారు. దీంతో మొక్కలు నాటించడానికి వెళ్లాం తప్ప ఎవరి పంట తొలగించలేదు.

– ఉపేంద్రయ్య, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్, కొణిజర్ల

భోపాల్ బీచ్‌లో ఖమ్మం విద్యార్థి మృతి

ఖమ్మం అర్బన్: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ బీచ్‌లో గల్లంతైన నలుగురు విద్యార్థుల్లో ఇద్దరు సురక్షితంగా బయటపడగా, మృతి చెందిన ఇద్దరిలో ఖమ్మంకు చెందిన హేమంత్‌కుమార్(20) ఉన్నాడు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ఊటుకూరి రామారావు – దుర్గాభవాని దంపతులు ప్రస్తుతం ఖమ్మం 10వ డివిజన్ చైతన్యనగర్‌లో ఉంటున్నారు. వీరి కుమారుడు హేమంత్ భోపాల్‌లోని వీఐటీలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆయన తన ముగ్గురు స్నేహితులతో కలిసి కాలేజీకి సమీపాన బీచ్ సందర్శనకు ఆదివారం వెళ్లాడు. అక్కడ నలుగురు నీటిలో దిగగా గల్లంతయ్యే క్రమంలో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. హేమంత్ సహా మరో విద్యార్థి గల్లంతవడంతో వారి మృతదేహాలను సోమవారం సాయంత్రం గుర్తించారు. ఈమేరకు హేమంత్ మృతదేహాన్ని మంగళవారం సత్తుపల్లికి తరలించి అంత్యక్రియలు పూర్తిచేశారు.